క్లుప్తంగా

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం



బైరాన్‌పల్లిలో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనయుడు రాకేష్‌రెడ్డి, జెడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు బర్మ రాజమల్లయ్యతోపాటు మరికొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశాడు. రాకేష్‌రెడ్డి తన వద్ద పాస్ ఉందని, గులాబీ కండువా వేసుకొని మీరు పోలింగ్ కేంద్రానికి ఎలా వస్తారని ప్రశ్నించాడు. కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసులు కలుగజేసుకొని వారికి సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

సిబ్బందిని అభినందించిన సీపీ

సిద్దిపేటకమాన్: జిల్లాలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగియడానికి విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఎన్నికలకు సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీటీసీకి పరామర్శ

నంగునూరు(సిద్దిపేట): నర్మేట ఎంపీటీసీ సభ్యుడు శనిగరం బాబు తండ్రి పోచయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకొని బాబును సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, లింగంగౌడ్, అజీద్, రవీందర్‌రెడ్డి, నారాయణ, శ్రీనివాస్, మల్లయ్య, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

దుబ్బాకరూరల్: మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన మెట్ల శ్రీను అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు రూ.74 వేలు మృతుడి కూతురు పేరిట బ్యాంక్‌లో డిపాజిట్ ఆ పత్రాలు కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరంతా 1998–99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు.

ఓటింగ్ సరళి వెల్లడి

హుస్నాబాద్: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ హుస్నాబాద్ నియోజకవర్గంలోని మొత్తం 304 కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిందని హుస్నాబాద్ అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రామ్మూర్తి సోమవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. ఓటింగ్ సరళి ఉదయం 9 గంటల వరకు 11.84 శాతం, 11 గంటల వరకు 30.35 శాతం, మధ్యాహ్నం 1 గంటల వరకు 48.83 శాతం, 3 గంటల వరకు 63.98 శాతం, 5 గంటల వరకు 73.63 శాతం నమోదైందని వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించింది

తొగుట(దుబ్బాక): ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా అధికార కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని వెంకట్రావుపేటలో సోమవారం పర్యటించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని యువతను మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ దక్కించుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో బీఆర్ఎస్ పాత్ర కీలకంగా మారనున్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోంపల్లి మనోహర్‌రావు, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు స్వామిగౌడ్, రాములు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత

సిద్దిపేటరూరల్: పదో తరగతి పరీక్షల్లో కేంద్రియ విద్యాలయం వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరీ సోమవారం తెలిపారు. మొత్తం 29 మంది పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు. 500 మార్కులకు గాను ఆరుగురు 400కు పైగా సాధించారు. వెరోనికా 469 మార్కులతో టాపర్‌గా నిలిచింది. రుషికేష్‌రెడ్డి 430 మార్కులు, చామకూర సిరిమోమిక 428 మార్కులు సాధించారు. మంచి మార్కులు వచ్చేలా కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ప్రశాంతంగా పోలింగ్

- ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లు
- ఉత్సాహంగా ఓటు వేసిన యువకులు
- పోలింగ్ సరళిని పరిశీలించిన నాయకులు
- పలుచోట్ల ఈవీఎంలు మొరాయింపు

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు బారులు తీరారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని 93వ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ మందకొడిగా సాగింది. ఒక దశలో ఓటర్లు లేక పోలింగ్ కేంద్రం వెలవెలబోయింది. పోలింగ్ కేంద్రాల్లో పచ్చదనం, పరిశుభ్రతతో ఓటింగ్ శాతాన్ని పెంచడం కోసం ఏర్పాటు చేసిన పర్యావరణ రహిత మహిళా పోలింగ్ కేంద్రాలు ఆకట్టుకున్నాయి. కేంద్రాల్లో తాగునీటితో పాటు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ విధించారు. మిరుదొడ్డి పోలింగ్ కేంద్రాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా ఓటు వేసిన ప్రతీ ఒక్కరూ సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడం కనిపించింది.

ఓటుహక్కును ఉపయోగించుకోవడంలో..

హుస్నాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సోమవారం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. గ్రామాల్లో ఓట్లు వేసేందుకు ఉదయమే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. మహిళలు, యువత ఓటుహక్కును ఉపయోగించుకోవడంలో ఆసక్తి చూపారు.

ఓటు హక్కును వినియోగించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, భూంరెడ్డి దంపతులు సోమవారం తమ హక్కును వినియోగించుకున్నారు. దుబ్బాకలో తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటు వేశారు.

29 గ్రామాల్లో 36 పోలింగ్ కేంద్రాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): లోక్‌సభ ఎన్నికల మండలంలోని ప్రశాంతంగా సాగాయి. మండలంలోని 29 గ్రామాల్లో 36 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు గొల్లపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. జగదేవ్‌పూర్, మునిగడప, ఇటిక్యాల గ్రామాల్లో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు జాతీయ పార్టీలు గజ్వేల్‌లో పోటీ ఇవ్వలేపోయాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. మెదక్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

హుస్నాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మండలంలో సోమవారం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. గ్రామాల్లో ఓట్లు వేసేందుకు ఉదయమే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. మహిళలు, యువత ఓటు హక్కును ఉపయోగించుకోవడంలో ఆసక్తి చూపారు. కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు.

ఓటర్లు లేక ..

అక్కన్నపేట(హుస్నాబాద్): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన కొన్ని కేంద్రాలు సోమవారం మధ్యాహ్నం ఓటర్లు లేక వెలవెలబోయాయి. అక్కన్నపేట మండలంలో మొత్తం 43 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు క్యూలో నిలబడి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మల్లంపల్లి, అక్కన్నపేట, అంతక్కపేట, రామవరం గ్రామాల్లో ఓటర్లు ఓటు



మర్కూక్ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

వేసేందుకు ఉదయం బారులు తీరారు. అదేవిధంగా నందారం, పోతారం(జే), రేగొండ, గోవర్ధనగిరి, ధర్మారం గ్రామాల్లో మధ్యాహ్నమే పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు లేక వెలవెలబోయాయి.

91వ మోడల్ పార్లమెంట్ పోలింగ్ స్టేషన్

కొండపాక(గజ్వేల్): ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. కొండపాక మండలం దుద్దెడలో ఏర్పాటు చేసిన 91వ మోడల్ పార్లమెంట్ పోలింగ్ స్టేషన్‌ను సోమవారం పోలీస్ కమిషనర్ అనురాధ, అదనపు కలెక్టరు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పోలింగ్ తీరును పరిశీలించారు. మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వసతులను చూసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,152 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం అదనపు కలెక్టరు శ్రీనివాస్‌రెడ్డి దంపతులు దుద్దెడలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన ప్రముఖులు

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని లింగాపూర్‌లో ఎంపీపీ లత, నరేందర్‌రెడ్డి దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి కాన్గల్‌లో, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తుక్కాపూర్‌లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

23 పోలింగ్ కేంద్రాలలో ..

మర్కూక్(గజ్వేల్): మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 23 పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుంచే ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఓటర్లు క్యూలో నిలుచున్నారు. మర్కూక్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఓటుహక్కుపై ప్రచారంతో..

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగింది. సామాజిక మాధ్యమాల్లో ఓటుహక్కు విలువపై విస్తృతంగా ప్రచారం జరగడంతో హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొండపాకలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓట్లు పడుతున్నాయా అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరా తీశారు.

మోడల్ పోలింగ్ కేంద్రం సందర్శన

దుబ్బాక టౌన్: దుబ్బాక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సీపీ అనురాధ సందర్శించారు. బందోబస్తు ఏర్పాట్లను దుబ్బాక సీఐ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే అదనపు డీసీపీ మల్లారెడ్డి దుబ్బాకలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.

యువకులు ఉత్సాహంగా

సిద్దిపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ గ్రామాల్లో నెమ్మదిగా కొనసాగింది. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటల లోపు వచ్చినవారందరూ ఓటు వేశారు. నూతన ఓటరుగా నమోదైన యువకు లు ఉత్సాహంగా ఓటు వేశారు. ఎంపీ ఎన్నికల అబ్జర్వర్ సమీర్‌మాదవ్ కుర్కోటి నారాయణరావుపేట, రాఘవాపూర్, చింతమడక గ్రామాల్లోని పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.



లింగాపూర్‌లో ఓటువేసిన ఎంపీపీ లత, నరేందర్‌రెడ్డి దంపతులు



కొండపాకలో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న మహిళా ఓటర్లు



రాఘవాపూర్‌లో ఓటువేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు



బస్వాపూర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న ఎంపీపీ కీర్తి

78 శాతం పోలింగ్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా 50 పోలింగ్ కేంద్రాలల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 37,245 మంది ఓటర్లు ఉండగా 29 వేల మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.78 శాతం పోలింగ్ నమోదైంది.

కేంద్రాలకు తరలివచ్చి..

నంగునూరు(సిద్దిపేట): లోక్‌సభ ఎన్నికలకు సోమవారం జరిగిన పోలింగ్ నంగునూరు మండలంలో ప్రశాంతంగా ముగిసింది. వృద్ధులు, దివ్యాంగులు కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. రాజగోపాల్‌పేట పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కేంద్రాలను పర్యవేక్షించారు.

86.05 శాతం నమోదు..

రాయపోలు(దుబ్బాక): పార్లమెంటు ఎన్నికల పోలింగ్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండలంలో మొత్తం 21,637 మంది ఓటర్లు ఉన్నారు. 86.05 శాతం మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వడ్డేపల్లిలో మద్యం బాటిళ్లు కలిగి ఉన్న గుమ్మడి లింగం, గుమ్మడి వెంకట్‌పై, చిన్న మాసాన్‌పల్లిలో ఆవుల కొండల్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. అలాగే రామారంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న పలువురిపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.15,210 స్వాధీనం చేసుకున్నారు.

కోహెడలో 79.02 శాతం..

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలో 79.02 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 4,092 ఓటర్లు ఉండగా ఇందులో 3,241 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 1620 మంది పురుషులు, 1621 మంది మహిళలు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.

కేంద్రాల పర్యవేక్షణ

ములుగు(గజ్వేల్): మండలంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు. కేంద్రాలను అధికారులు పర్యవేక్షించారు.



దుద్దెడలో ఓటు వేసినట్లు చూపుతున్న అదనపు కలెక్టరు శ్రీనివాస్‌రెడ్డి



పొట్లపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు



ఓటుహక్కును వినియోగించుకున్న దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, భూంరెడ్డి దంపతులు



జగదేవ్‌పూర్‌లో ఓటర్లతో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



ఓటర్ల లేక వెలవెలబోయిన నందారంలోని పోలింగ్ కేంద్రం



మిరుదొడ్డిలో ఏర్పాటు చేసిన పర్యావరణ రహిత మహిళా పోలింగ్ స్టేషన్



తుక్కాపూర్‌లో ఓటువేసిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



వర్గల్ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు



లింగారెడ్డిపల్లిలో ఓటు వేసినట్లు చూపుతున్న ఓటర్లు



రాజగోపాల్‌పేటలో వలంటీర్ సాయంతో ఓటుహక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు

భువనగిరి పార్లమెంట్ పరిధిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): లోక్‌సభ ఎన్నికలు భువనగిరి పార్లమెంట్ పరిధి కొమురవెల్లి మండలంలోని 17 పోలింగ్ స్టేషన్లలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 15,322 మంది ఓటర్లు ఉండగా 11,516 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం పోలింగ్ 77.11 శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

మొరాయించిన వీవీ ప్యాట్‌లు

మండలంలోని కిష్టంపేట, గౌరయపల్లి గ్రామాలలో పోలింగ్ మొదలైన తర్వాత వీవీ ప్యాట్‌లు మొరాయించాయి. ఎన్నికల సిబ్బంది సెక్టోరియల్ అధికారులకు తెలపడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో సమస్య సద్దుమణిగింది. అదే విధంగా మండలంలోని అయినాపూర్‌లోని 14వ నంబర్ పోలింగ్ బూత్‌లో కంట్రోలు యూనిట్ మొరాయిండంతో పోలింగ్ నిలిచిపోయింది. వెంటనే మరొకటి ఏర్పాటు చేయడంతో పోలింగ్ కొనసాగింది.



గౌరయపల్లిలో బారులు తీరిన ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు



ఓటు హక్కు వినియోగించుకున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ చేర్యాల పట్టణ, మండల పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. చేర్యాల పట్టణ కేంద్రంలోని రెండు కేంద్రాల్లో, ఆకునూరు 32వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పట్టణ కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వచ్చినప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఘర్షణ పడ్డారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కొమ్మూరి రాకేష్ రెడ్డి పోలింగ్ కేంద్రం లోపల ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్, సీపీఎం నాయకులు గొడవకు దిగారు. పోలీసులు కలుగచేసుకుని వారిని పంపించివేశారు. 45వ కేంద్రంలో సిబ్బంది క్రమసంఖ్య తప్పుగా నమోదు చేయడంతో ఒకరికి బదులు మరొకరి ఓటు వేసినట్లు నమోదైంది. ఓటరు ఆందోళనకు దిగడంతో విచారణ జరిపిన అధికారులు విషయం తెలుసుకుని అతడితో ఓటు వేయించారు.

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లో లోక్‌సభ పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మద్దూరు మండలంలోని లద్నూరు,వల్లంపట్ల,దూళ్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైయింది.

ఎమ్మెల్యే పూజలు



గంగాపూర్‌లో బీరప్ప కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): బీరప్ప, ఎల్లమ్మ దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మండల పరిధిలోని గంగాపూర్‌లో బీరప్ప కల్యాణం, మాచాపూర్‌లో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా నినాదాలు

హుస్నాబాద్: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల ఆవరణలో పలుపార్టీలకు చెందిన కార్యకర్తలు తమ పార్టీ గుర్తుకు ఓటు వేయాలని పోటాపోటీగా నినాదాలు చేశారు. మొత్తం 304 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని హుస్నాబాద్ అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రామ్మూర్తి తెలిపారు. 77.43 శాతం పోలింగ్ నమోదైందన్నారు. మొత్తం 2,47,701 ఓట్లకుగాను 1,91,804 పోలైయాయ్యన్నారు. 95618 పురుషులు , 96184 మహిళలు, ఇతరులు ఇద్దరు ఓటు వేసినట్లు తెలిపారు.

అత్యధికంగా దుబ్బాక నియోజకవర్గంలోనే ..

దుబ్బాక: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. అత్యధికంగా దుబ్బాక నియోజకవర్గంలోనే పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ సరళని ప్రధాన పార్టీల ఎంపీ అభ్యర్థులు పరిశీలించారు.

48 పోలింగ్ కేంద్రాల్లో

చిన్నకోడూరు(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మండలంలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 48 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు పెద్దకోడూరు, చిన్నకోడూరు, మాచాపూర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేటు వాహనాల్లో వెళ్లి..

వర్గల్(గజ్వేల్): మండలంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. బొర్రగూడెం, దండుపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ఓటేసేందుకు మజీద్‌పల్లి పోలింగ్ కేంద్రానికి ప్రైవేటు వాహనాలలో తరలివెళ్లారు.

75.2 శాతం పోలింగ్

బెజ్జంకి(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 75.2 శాతం పోలింగ్ నమోదైంది. రేగులపల్లె పోలింగ్ కేంద్రలను డీపీఓ దేవకీదేవి సందర్శించి పోలింగ్ సరళి తెలుసుకున్నారు.